ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5, కనిష్ఠం 24.5
నిజామాబాద్
జిల్లా వార్తలు

శనివారం 24 ఆగస్టు 2024



నవీపేటలో అధికారులకు దరఖాస్తు అందజేస్తున్న రైతులు



ముప్కాల్‌లో అధికారులకు దరఖాస్తు అందజేస్తున్న రైతులు

నేడు చలో ఆర్మూర్

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా



- జిల్లాలో రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్
- మద్దతు ప్రకటించిన బీజేపీ, బీఆర్‌ఎస్
- ధర్నాకు షరతులతోకూడిన అనుమతి
- జిల్లాలో రుణమాఫీ కోసం పెరుగుతున్న దరఖాస్తుల సంఖ్య
- తప్పిదాలను సవరించి రుణమాఫీ చేయాలని కోరుతున్న రైతులు

నిజామాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లాలో రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం 'చలో ఆర్మూర్'కు పిలుపునిచ్చారు. జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు చెందిన రైతులు హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా రుణమాఫీ చేయలేదని కొంత మందికే పూర్తిస్థాయిలో రుణమాఫీ అయిందని రైతు సంఘాల నేతలు ఈ ఆందోళనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వానికి తమ ఆందోళన ద్వారా రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేయడంతో పాటు నిర్ణీత సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ మాఫీ చేయాలని కోరేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైతు ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు ప్రకటించారు. పోలీసుల నుంచి షరతులతో కూడిన అనుమతులు ఇచ్చినా.. పూర్తిస్థాయిలో రైతులు 'చలో ఆర్మూర్'కు తరలిరావాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో వివరాలను సేకరిస్తున్న రైతు ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు రుణమాఫీ ఏకకాలంలో చేయాలని ప్రధాన డిమాండ్‌తో రాజకీయాలకు అతీతంగా ఈ ఆందోళన నిర్వహిస్తున్నారు. 'చలో ఆర్మూర్'కు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు కూడా మద్దతు ప్రకటించారు. రైతుల రుణమాఫీ కోసం చేస్తున్న ధర్నాకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆ పార్టీలకు చెందిన నేతలు ప్రకటించారు.

షరతులతో కూడిన అనుమతులు

రైతు ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చలో ఆర్మూర్' సభకు పోలీసులు షరతులతో కూడిన అనుమతులను మంజూరు చేశారు. నిర్ణయించిన ప్రదేశంలోనే ఈ సభను నిర్వహించుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్లపై ధర్నాలు, ర్యాలీలకు అనుమతులు లేవని రైతు సంఘాల నేతలకు ఇచ్చిన అనుమతుల్లో పేర్కొన్నారు. ఆర్మూర్ సభ కోసం నక్కల భూమారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, వి.ప్రభాకర్, దేగాం యాదాగౌడ్, ఇత్తడి లింగారెడ్డి, బి.దేవరాం, సుక్కి సుధాకర్, వెల్మల్ రాజన్న, అర్గుల్ సురేష్, జాడి భాస్కర్, మాచర్ల సాగర్ ఇచ్చిన పిటిషన్ ఆధారంగా అనుమతులను మంజూరు చేస్తున్నామని ఆర్మూర్‌కు చెందిన ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ బస్వారెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిన్న తేడాతోనే రుణమాఫీ కాలేదు..
:కుంట గంగారెడ్డి, గడ్కోల్ (సిరికొండ)



తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రెండు లక్షల రుణం తీసుకున్నాను. చిన్న కారణంతోనే రుణమాఫీ చేయలేదు. పట్టాదారు పాసుపుస్తకంలో, బ్యాంకు ఖాతాలో కుంట గంగారెడ్డి అని పేరు ఉండగా ఆధార్‌లో మాత్రం కుంట గంగిరెడ్డి అని పడటం వల్ల రుణమాఫీకి నిరాకరించినట్లు తెలిపారు.

ఆధార్ మ్యాచ్ కాక రుణమాఫీ చేయలేదు..
:గైని ప్రవీణ్, రాంపూర్ (నవీపేట)



యూనియన్ బ్యాంకులో రూ.83వేలు రుణం తీసుకున్నాను. మొదటి నుంచి మూడు విడతల్లో రుణమాఫీ కాలేదు. ఆధార్ మ్యాచ్ కాకపోవడం వల్ల రుణమాఫీ చేయలేదు. మిగతా రైతుల్లాగానే రుణమాఫీ చేయాలి. అధికారులు అన్ని వివరాలను తీసుకుని రుణమాఫీ చేయాలి.

ఆధార్, బ్యాంకు ఖాతాలో పేరులో తేడా..
:జుర్రు శోభ, పోతంగల్ (నవీపేట)



యూనియన్ బ్యాంకు నవీపేటలో 2023 ఆగస్టులో లక్షా 20వేలు రుణం తీసుకున్నాను. వడ్డీతో లక్షా 38వేలు అయింది. ఆధార్‌లో జుర్రు శోభ ఉంది. బ్యాంకు ఖాతాల్లో డి.శోభ అని పడటం వల్ల రుణమాఫీ చేయలేదు. అధికారులు తప్పిదాలను సవరించి తనకు రుణమాఫీ చేయాలి.

అనుమతి ఇచ్చిన ప్రకారం సాయి గార్డెన్ మామిడిపల్లిలోనే నిర్వహించాలని కోరారు. ఈ సమావేశం కోసం ఐక్య కార్యచరణ కమిటీకి 18 షరతులను విధించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటలలోపే ధర్నా పూర్తి చేయాలన్నారు. రోడ్లపై, హైవేలపై ధర్నాలకు అనుమతులు లేవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ధర్నా వల్ల వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసానికి పాల్పడినా.. ప్రభుత్వ అధికారులను కానీ, ప్రజాప్రతినిధులను కానీ తిట్టినా లేదా దాడులకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెచ్చగొట్టే స్లోగన్‌లు కానీ, స్పీచ్‌లు గానీ ఇవ్వవద్దని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు వంద మీటర్ల దూరంలోనే ఈ సభను నిర్వహించుకోవాలని కోరారు. ఈ సభ సందర్భంగా ఆసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలు, సంస్థల పనులకు అంతరాయం కల్పించవద్దని కోరారు. సభకు వచ్చేవారు కట్టెలు కానీ, రాళ్లు కానీ, పేలుడు పదార్థాలు కానీ, దాడులు చేసే మారణాయుధాలు కానీ తీసుకువచ్చేందుకు అనుమతులు లేవని తెలిపారు. సభను నిర్వహించే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, డ్రోన్‌లు వినియోగించవద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సభ నిర్వహణ మొత్తం రికార్డ్ చేసి ఒక కాపీని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోకు అందించాలని ఆ ఉత్తర్వులో కోరారు. వీటిలో ఏది ఉల్లంఘించిన అనుమతులను రద్దు చేస్తామని ఏసీపీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిర్ణీత ప్రాంతంలోనే అనుమతి

'చలో ఆర్మూర్' పేరిట నిర్వహిస్తున్న ధర్నాకు నిర్ణీత ప్రాంతంలోనే అనుమతి ఉందని మిగతా చోట్ల ఎలాంటి అనుమతులు లేవని నగర పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. సభ జరిగే చోట మినహాయించి ఆర్మూర్‌లో కానీ, బాల్కొండలో కానీ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఐదు మంది మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భారీగా దరఖాస్తులు

జిల్లాలో రుణమాఫీ కాని రైతులు అధికారులకు భారీ సంఖ్యలో దరఖాస్తులను చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో నోడల్ అధికారులు సమావేశాలను నిర్వహించి ఈ దరఖాస్తులను తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 14,500 దరఖాస్తులు రైతులు రుణమాఫీ కోసం చేశారు. రైతువేదికలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతాల్లో చిన్నపాటి తేడాలు ఉన్న రుణమాఫీ చేయలేదని, అధికారులు పరిశీలించి మిగతా రైతుల్లాగానే తమకు రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. జిల్లాలో లక్షా, లక్షన్నర, రెండు లక్షల లోపు రుణమాఫీ కాని రైతులు తమకు సంబంధించిన ఆధార్, పట్టాదారు పాసుబుక్, బ్యాంక్ ఖాతాలతో పాటు పూర్తి వివరాలను నింపి వ్యవసాయ శాఖ అధికారులకు అందిస్తున్నారు.



• సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సీఎం రేవంత్‌రెడ్డి రొటేషన్ చక్రవర్తి

- రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదు
- బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనమవుతుందని తప్పుడు ప్రచారం : ఎంపీ అర్వింద్

నిజామాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి రొటేషన్ చక్రవర్తి అని ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు పూర్తిస్థాయిలో రెండులక్షల లోపు రుణాన్ని మాఫీ చేస్తానని ప్రకటించారని అన్నారు. ప్రస్తుతం షరతులు విధించి కేవలం 30 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రుణమాఫీపై ఎలాంటి షరతులు పెట్టలేదన్నారు. రుణమాఫీ చేయక రైతులను రోడ్డెక్కె పరిస్థితికి తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. జిల్లాలో రెండులక్షల 55వేల మందికి పైగా రైతులు ఉంటే కేవలం 83వేల మందికి మాత్రమే ఇప్పటి వరకు రుణమాఫీ చేశారని ఆయన విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వానికి, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎలాంటి తేడా లేదన్నారు.

కేసీఆర్, కేటీఆర్, కవితలకు బీజేపీతో సంబంధం లేదు

కేసీఆర్, కేటీఆర్, కవితకు బీజేపీతో సంబంధం లేదని వారిని తమ పార్టీలో చేర్చుకోరని ఎంపీ అర్వింద్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారన్నారు. బీజేపీలో చేరాలనుకుంటే రాజీనామా చేసి రావాలని ఇప్పటికే కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారని తెలిపారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అవుతుందని కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్మూర్‌లో శనివారం జరిగే రైతు ఐక్యకార్యచరణ కమిటీ ఆందోళనకు తమ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఇన్‌చార్జిగా తనను నియమించారని ఆయన తెలిపారు. అక్కడ బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా నేతలు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బిల్లుల విడుదల



నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 23:2024-25 విద్యాసంవత్సరానికి గాను జూలై నెల మధ్యాహ్న భోజన బిల్లుల కోసం నిధులు విడుదల చేయడం జరిగిందని డీఈవో ఎస్.వి.దుర్గాప్రసాద్ తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు కుక్కింగ్ కాస్ట్‌కు గాను 66లక్షల 98వేల 953 రూపాయలు, సిసిహెచ్‌ల గౌరవవేతనం రూ.1000కి గాను 20లక్షల 44వేల బడ్జెట్‌ను మండలా ల వారీగా అకౌంట్‌లలో రిలీజ్ చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు నిధులను మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు పీఎఫ్‌ఎంఎస్ ద్వారా విడుదల చేయడానికి ఆదేశాలు ఇచ్చామని ఒకటి రెండు రోజుల్లో బిల్లులు ఏజెన్సీల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

వచ్చే నెల18 నుంచి పరీక్షలు

2022-24 విద్యాసంవత్సరానికి గాను డీఈఎల్‌ఈడి పరీక్షలు సెప్టెంబర్ 18 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వి.దుర్గాప్రసాద్ తెలిపారు. పూర్వము ఫెయిల్ అయిన విద్యార్థుల రెండో సంవత్సరం పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 18 నుంచి 24 వరకు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

జవహర్ నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం..

2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ నిజాంసాగర్‌లో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను సెప్టెంబర్ 16లోపు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని జనవరి 18, 2025న ప్రవేశ పరీక్ష ఉంటుందని అభ్యర్థులు తమ దరఖాస్తులను నవోదయ.జీవోవి.ఇన్, ఎన్‌విఎస్‌అడ్మిషన్‌క్లాస్‌నైన్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఇతర వివరాలకు ప్రిన్సిపాల్ జవహర్ నవోదయ 9701907749 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



• బాల్కొండలో ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న ఇంటి నిర్మాణం

బాల్కొండలో.. ఆగని ఆక్రమణలు!

డాక్యుమెంట్ ఒకచోట.. నిర్మాణం మరోచోట — పట్టించుకోని అధికారులు

ముప్కాల్ ఆగస్టు 23: బాల్కొండ మండల కేంద్రంలో భూ కబ్జాదారుల ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోతోంది. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బాల్కొండ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 1333లో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులతో అధికారులు సర్వే చేపట్టారు. అయితే సర్వే నివేదిక ఆరునెలలుగా అందించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ కట్టడాలపై ఫిర్యాదు అందుకున్న అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాలను సైతం పరిశీలించారు. నకిలీ పట్టాల బాగోతం మాత్రం నిగ్గు తేల్చలేదు. అందుకు తోడు సర్వే తీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే మరింత అనుమానాలకు బలం చేకూరుతోంది. అయితే సర్వే నివేదిక రాక ముందే నిర్మాణాలు జోరందుకున్నాయి.

అక్రమ నిర్మాణ పనులను నిలిపివేశాం..
:రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

గతంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పలు ఫిర్యాదులతో నిర్మాణ పనుల నిలిపివేశాం. సర్వేనెంబర్ 1333లో అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్న పిల్లర్ల డబ్బాలను స్వాధీనం చేసుకొని నోటీసు జారీ చేశాం. ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో ఎవ రు ఇంటి నిర్మాణాలు చేపడతలేరు. ఫిర్యా దులు వస్తే వాటిపై చర్యలు తీసుకుంటాం.

డాక్యుమెంట్ ఒక చోట నిర్మాణం మరో చోట..

సర్కారు స్థలాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో కొందరు అక్రమార్కులు డాక్యుమెంట్లను ఒకచోట నిర్మాణం మరో సర్వే నెంబర్ ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణం పూర్తయితే ఎవరు ఏమి చేయలేదనే ధీమాతో పనులు కొనసాగిస్తున్నారు. ఫిర్యాదులు రాగానే పనులు నిలిపి ఆ తర్వాత నిర్మాణాలు చేపడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై లోతుగా విచారణ చేపడితే తప్ప.. భూ కబ్జా బాగోతాలు బయట పడవని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్వయం ఉపాధి శిక్షణ దరఖాస్తులకు నేడే చివరి తేదీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 23: బీసీ స్టడీ సర్కిల్ సహకారంతో ఎల్బీహోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ద్వారా 90 రోజుల నాన్ రెసిడెన్షియల్ స్వయం ఉపాధి కోసం ఉచిత శిక్షణను హైదరాబాద్‌లో ఇవ్వనున్నారని ఈ శిక్షణ కోసం జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులు శనివారం సాయంత్రం వరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగి ఎస్సెస్సీ, ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5లక్షలలోపు కలిగిన వారు అర్హులని ఆమె తెలిపారు. ఎస్సెస్సీ మార్కుల ఆధారంగా మెరిట్ ద్వారా వంద మందిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని శిక్షణ కాలంలో నెలకు రూ.4వేల చొప్పున మూడు నెలల పాటు స్టయిఫండ్ ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, డిష్ వాషర్, ఏసీ రిపేర్, ఇన్‌స్టాలేషన్, గ్యాస్ చార్జింగ్, ఓఎల్‌ఈడి మానిటర్, ఎల్‌ఈడి టీవీ, మైక్రో ఓవెన్, వాటర్ ప్యూరిఫయిర్, తదితర శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అర్హులైన బీసీ అభ్యర్థులు టిజిబిసిస్టడీసర్కిల్.సిజిజి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఇతర వివరాలకు 08462-241055 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

వేల్పూర్, ఆగస్టు 23: మండలంలోని లక్కోర గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపవర్ నిర్మాణ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీ రాజ్ మాట్లాడుతూ.. తమ క్లబ్ ఆధ్వర్యంలో పలు రకాల సామాజిక సేవలు చేపట్టడం జరిగిందని, ముఖ్యంగా పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన అవసరమైన వస్తువులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీ రాజ్, సభ్యులు బైరి శ్రీధర్, గుర్రం విజయానంద్, లక్కోర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయాధికారులకు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

రుణమాఫీకి దరఖాస్తుల స్వీకరణ

ముప్కాల్ ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా రూ.లక్ష లోపు పంట రుణం కలిగి ఉండి రుణమాఫీ జరగని రైతుల నుంచి వ్యవసాయా శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సాంకేతిక లోపం వల్ల, ఇతర కారణాల వల్ల రుణమాపీ జరగని రైతులు రూ.2లక్షల పంట రుణం జరగని రైతులు మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించబడుతాయని రైతులకు తెలియజేశారు.

సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాంత్

బోధన్‌రూరల్, ఆగస్టు 23: బోధన్ సార్వజనిక్ నూతన ఉత్సవ కమిటీని శుక్రవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీ సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కే.శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తాడు మహేష్, కోశాధికారిగా గంగుల దేవిదాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ గ్రామ కమిటీ అధ్యక్షులు బాగారెడ్డి, రుద్ర సత్యనారాయణ, సూర్యప్రకాష్, బీర్కూర్ బుజ్జి, విజయ్, పిట్ల సత్యం, రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

భిక్కనూరు, ఆగస్టు 23: భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామశివారులో గల శ్రీ కృష్ణమందిరం, శ్రీ బ్రహ్మజ్ఞాన ఆశ్రమంలో సోమవారం శ్రీ కృష్ణష్టమి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని శ్రీ బ్రహ్మజ్ఞాన ట్రస్ట్ చైర్మన్ రంగు హన్మాగౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భిక్కనూరులో సైన్స్ టాలెంట్ టెస్ట్

భిక్కనూరు, ఆగస్టు 23: భిక్కనూరు మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నేషనల్ స్పేస్ డేను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, సూజాత, సైన్స్ ఉపాధ్యాయుడు తమ్మల రాజు, ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 23: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎంపవర్ నిర్మాణ్ కార్యక్రమంలో భాగంగా శానిటరీ నాప్కిన్స్‌ను అందజేశారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉంటూ తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, అంబల్ల తిరుపతి, గుర్రం విజయానంద్, బైరి శ్రీధర్, చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ నుస్రత్‌జహన్, లెక్చరర్‌లు బి.వనిత, తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఇసుక డంప్‌ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ఇదే..

కోటగిరి,ఆగస్టు23: పొతంగల్ మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 45ట్రాక్టర్ల ఇసుక నిల్వలను శుక్రవారం తహసీల్దార్ మల్లయ్య సీజ్ చేశారు. పొతంగల్ గ్రామానికి చెందిన శెట్టి నవీన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరభద్రుడి గుడి వద్ద 35ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. కొడిచర్ల రహదారిలో మరో 10ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన ఇసుకకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు23: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన బాలపల్లి నర్సవ్వ అనే వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని దొంగలు నాలుగు తులాల బంగారు నగలను చోరీ చేశారు. పెర్కిట్‌లోని తన ఇంటి నుంచి ఎంఆర్ గార్డెన్‌లో జరిగే బంధువుల పెళ్లికి ఆటోలో వెళ్లగా ఆటోలో ఉన్న ముగ్గురు మామిడిపల్లి శివారులోకి తీసుకువెళ్లి ఆటోను నిలిపి వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు నగదును దోచుకొని వృద్ధురాలిని తోసి వేసి పరారయ్యారు. దీంతో వృద్ధురాలు రోదించడంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోధన్‌లో సామూహిక సీమంతాలు

బోధన్‌రూరల్,ఆగస్టు23: బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ చైర్మన్ కొత్తపల్లి నవిత, తన్నీరు రాజ్యలక్ష్మి, వేమూరి లక్ష్మిలు మాట్లాడుతూ మాతృత్వం వరం లాంటిదని పేర్కొన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణులు మానసిక ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు భారతి, అంజనా దేవి, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, మంజూష, సుబ్బారావు, పోశెట్టి, ఆదినారాయణ రెడ్డి, తదితరులున్నారు.

మెరుగైన వైద్యసేవలే ప్రభుత్వ ధ్యేయం

బోధన్‌రూరల్,ఆగస్టు23: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నాగేశ్వర్ రావు, మందర్నా రవి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమకు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ వాటికి సీఎం సహాయనిధి కింద నిధులను ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందన్నారు. మెరుగైన వైద్యం అందించడం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శరత్ రెడ్డి, మాజీకౌన్సిలర్ దాము, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్ రెడ్డి, పీఏ రమణలతో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ఎడపల్లి, ఆగస్టు23: మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సూర్య ఆరోగ్యసంస్థ, ఛత్రపతి యువజన సంఘం వారు సంయుక్తంగా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన 26 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి త్వరలో వారికి కంటి అద్దాలు అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఛత్రపతి యువజన సంఘం సభ్యులు నర్సింలు, వెంకటేష్, కిరణ్, రాకేష్, ప్రవీణ్ రాజు, సంతోష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నిరంతర శ్రమతోనే లక్ష్య సాధన సాధ్యం

● నాళేశ్వర్‌కు చెందిన పర్వతారోహకుడు ఆర్మూర్ మారుతి



మారుతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

నవీపేట,ఆగస్టు23: నిరంతర శ్రమ ఉంటే అనుకున్న లక్ష్య సాధన చేపట్టడం చాలా సులువు అవుతుందని మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన పర్వతారోహకుడు ఆర్మూర్ మారుతి అన్నారు.ఇటీవల ఐరోపా ఖండంలోని ఎత్తైన ఎల్‌బ్రస్ శిఖరాన్ని అధిరోహించి ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈసందర్భంగా శుక్రవారం నాళేశ్వర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్థులు, యువకులు ఆర్మూర్ మారుతిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో పైకి ఎదగాలంటే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా నిరంతరం శ్రమించాలని అన్నారు.భవిష్యత్‌లో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, ప్రవీణ్, శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదిప్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ఎడపల్లి, ఆగస్టు23: ఎడపల్లి మండల కేంద్రంతోపాటు జానకంపేట గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులిశ్రీనివాస్ సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 65 మంది లబ్ధిదారులకు గాను రూ.15 లక్షల 63 వేల సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా మంజూరు అయ్యాయని వాటికి సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్ గౌడ్, రాదాకిషన్ గౌడ్, లింగం, ఎల్లయ్య యాదవ్, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అగ్నిప్రమాద భద్రతపై అవగాహన

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు23: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అగ్నిప్రమాద భద్రతపై ఆర్మూర్ అగ్నిమాపక కేంద్రం వారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరగకుండా ఎలా కాపాడుకోవచ్చో మేళకువలను నేర్పించారు.ఈ కార్యక్రమంలో కాంతి హైస్కూల్ కరస్పాం డెండ్ కాంతి గంగారెడ్డి, లీడింగ్ ఫైర్ ఆఫీసర్ సురేష్, సిబ్బంది,పాల్గొన్నారు.

జిల్లా పౌర సరఫరాల అధికారిగా అరవింద్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 23: జిల్లా పౌర సరఫరాల అధికారిగా అరవింద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా ఏసీఎస్‌వోగా పనిచేస్తున్న అరవింద్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వం జిల్లా డీఎస్‌వోగా బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఎస్‌వోగా రెండున్నర నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన పద్మను హైదరాబాద్‌కు బదిలీ చేశారు.

వైద్యం వికటించి యువకుడు మృతి చెందాడని రాస్తారోకో

● వైద్యుడితో వాగ్వాదం ● ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ ● నిలిచిన వాహనాలు ● పోలీసుల రాకతో ఆందోళన విరమణ



భిక్కనూరులో రాస్తారోకో చేస్తున్న దృశ్యం



ఆందోళనకారులను పోలీసులు సముదాయిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఆగస్టు 23: ప్రైవేటు వైద్యుడు చేసిన వైద్యం వికటించడం కారణంగానే యువకుడు మృతిచెందాడని, మృతుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాతహరిజనవాడకు చెందిన కాలనీ వాసులు శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధిత కుటుంబసభ్యులు, కాలనీ వాసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెర్కుల స్వామి(36) గత కొన్నిరోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం బస్టాండ్ సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి గురువారం సాయంత్రం కుటుంబసభ్యులు తీసుకురాగా వైద్యుడు చికిత్స నిర్వహించి గంట అనంతరం కొద్దిగా పరిస్థితి సీరియస్‌గా ఉందని వెంటనే కామారెడ్డికి తీసుకెళ్లమని కుటుంబసభ్యులకు తెలిపాడు. వైద్యుడి ఆదేశాల మేరకు వెంటనే కామారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వామి మృతిచెందాడు.దీంతో కాలనీవాసులు, కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రి వద్దకు శుక్రవారం ఉదయం చేరుకుని ఆసుపత్రికి మూసివేయించి వైద్యం వికటించడంతోనే స్వామి మృతిచెందాడని వైద్యుడుతో వాగ్వాదానికి దిగారు. మృతుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వైద్యుడి లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ ఎదుట పాత జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై సాయికుమార్ రాస్తారోకో చేస్తున్న వారిని సముదాయించి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. రాస్తరోకో కారణంగా రోడ్డు ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పోలీసులు వాటిని పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో పాతహరిజనవాడ కాలనీవాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

పెద్దబజార్, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ సమగ్రంగా అమలు చేయాలని అఖిల భారత ప్ర గతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో మార్క్స్ భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక సమస్యలను ముఖ్యంగా రైతన్నల సమస్యలను చర్చించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ సమగ్రంగా అమలు చేయలేదని అర్హులైన రైతుల్లో సగం మందికి రకరకాల కొర్రీల్లతో ఆపివేసిందన్నారు. ఆంక్షలు పెట్టకుండా రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. రైతుభరోసా కూడా ప్రారంభించాలని రైతు పంటలన్నింటికి బోనస్ 500 రూపాయలు ఇవ్వాలని పంట భీమా, రైతుభీమాకు ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి వెంటనే అమలు చేయాలన్నారు. ఈనెల 25 నుంచి 31 వరకు జిల్లా వ్యవసాయ అధికారుల కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి చంద్రన్న, దేవరాం, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాము, వెంకటేశ్వర్లు, రాంచందన్, యాదగిరి, కిశోర్, సూరి, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలి

ధర్పల్లి: ధర్పల్లి, సిరికొండ మండల కేంద్రాలలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను వెంటనే అర్హులకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇరు మండలాల్లో పర్యటించి డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఏ పథకాలను సంపూర్ణంగా పూర్తి చేయలేదని అన్నారు. అందులో ముఖ్యంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రకటించి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయించి నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇప్పటివరకు పేదలకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పేదల ఇళ్ల నిర్మాణం కల ఎండమావిగా మారిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత కేసీఆర్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొని డబుల్‌బెడ్‌రూంలను నిర్మించి పేదలకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. అందుకే ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపారని అన్నారు. నివాసానికి ఉపయోగకరంగా ఉన్న డబుల్‌బెడ్‌రూంలను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అర్హులకు వెంటనే పంపిణీ చేసి పేదవారి ఇంటి కల నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ సహాయకార్యదర్శి ఆర్.రమేష్, మండల నాయకులు ఈ.రమేష్, తదితరులు ఉన్నారు.

కొడుకును కడతేర్చిన తండ్రికి పదేళ్ల జైలుశిక్ష

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 23: ఆస్థిలో వాటా అడిగిన కన్న కొడుకును కట్టెతో కొట్టి తీవ్రంగా గాయపర్చి అతని మృతికి కారణమైన కన్న తండ్రికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ న్యాయాధికారి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మోకాన్‌పల్లి గ్రామానికి చెందిన సంగెం కిషన్ గ్రామ శివారులోని అర ఎకరం వ్యవసాయ భూమి అమ్మివేయగా 9 లక్షలు వచ్చాయి. వచ్చిన డబ్బులతో తన వాటా ఇవ్వాలని కొడుకు సంగెం శ్రీకాంత్ తండ్రిని కోరాడు. ఈ విషయంలో వారు ఇద్దరు అప్పుడప్పుడు ఘర్షణ పడేవారని తెలిపారు. 14 అక్టోబర్ 2023న కిషన్ భోజనం చేసి నిద్రించాడు. తండ్రి దగ్గర ఉన్న ఫోన్‌ను శ్రీకాంత్ తీసుకొని వెళ్తుండగా తండ్రి లేచి నా ఫోన్‌ను ఎందుకు తీసుకెళ్తున్నావని అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటి మాటికి డబ్బులు అడుగుతున్నాడని కొడుకును ఎలాగైనా చంపివేయాలని నిర్ణయించుకొని కట్టెతో కొడుకు శ్రీకాంత్ తలపై బలంగా కొట్టడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కోర్టు నేరన్యాయ విచారణలో సాక్షులు న్యాయస్థానంలో చెప్పిన వాంగ్మూలాలు, ధ్రువీకరించుకున్న పత్రాలు పరిశీలించి వస్తుగత సాక్ష్యాన్ని పరిగణలోకి తీసుకొని కిషన్‌పై హత్య నేరారోపణ కాకుండా ఆవేశంతో చేసిన కారణం వల్ల శ్రీకాంత్ మృతి చెందడానికి కారకుడైనందున భారత సిక్షాస్మృతి సెక్షన్ 304 పార్ట్-2 ప్రకారం పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి సునీత తీర్పు వెల్లడించారు.

ఆర్మూర్‌లో విషజ్వరాలు



ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు23: మున్సిపల్ పరిధిలోని ఆర్మూర్, పెర్కిట్, కోటార్మూర్, మామిడిపల్లిలో ప్రజలు విషజ్వరాలతో భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డులో ఏదో ఒక్కరికి ప్రతీరోజు విషజ్వరాలతో పాటు మలేరియ, డెంగ్యు, చికెన్ గున్యా వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రతీవార్డుల్లో డ్రైనేజీలో నిలిచిన నీరు, రోడ్లపై నిలిచిన నీరు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలేదు. ప్రతీ వార్డులో శుభ్రత లేక పోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రతీ రోజు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు నుంచి ఆరు డెంగ్యు కేసులు నమోదు కాగా మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు సైతం నమోదుఅవుతున్నాయి. లి, వణుకుతో కూడిన జ్వరం రోజు విడిచి రోజు వచ్చే జ్వరం తలనొప్పి, ఒంటి నొప్పులు, వంతులు వచ్చినట్టు ఉండుటా, అలసట, నిరాసం, రక్తహీనతలు కలవు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయుల నిరసన

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 23:నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 2003 నుంచి నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ విధానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని ఈ విధానాన్ని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు రద్దు చేశాయని కావున ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాములు, రజిని, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆగస్టు 23ను బ్లాక్ డేగా ప్రకటించారు. ఈ విధానానికి కారణమైన జీరో పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, సంధ్య, వినోద్, రవి, దీపిక, భూవనేశ్వరి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ బస్టాండ్ ఆవరణలో స్థల పరిశీలన

మోర్తాడ్, ఆగస్టు23: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ లో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం ఆర్డీవో రాజాగౌడ్, ఆర్టీసీ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం మోర్తాడ్‌లోని బస్టాండ్ ఆవరణలో పెట్రోల్ ఆవరణలో నిర్మాణానికి కొలతలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్, ఆర్మూర్ ఆర్టీసీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాలను ఉపసంహరించుకుంటాం

సిరికొండ ఆగస్టు 23 : 2005 తర్వాత కొత్తగా అడవీని నరికి వేయడం వల్ల వచ్చిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను ఉపసంహరించుకోవడానికి జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజేయనున్నట్లు ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీ హక్కు చట్టం 2006 ప్రకారం అర్హులైన హక్కు పత్రం లభించిన వారు వారికి కేటాయించన విస్తీర్ణంలో మాత్రమే సాగుచేసుకోవడానికి హక్కు మాత్రం ఉంటుందని ఆయన తెలిపారు.ఇచ్చిన హక్కు పత్రంలో పేర్కోన్న విస్తీర్ణం కంటే ఎక్కువ గాని, కొత్తగా పోడు చేసినట్లైయితే లబించిన అటవీ హక్కు పత్రాల రద్దు కోసం అటవీ శాఖ ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని ప్రకనటలో ఎఫ్‌డీవో పేర్కోన్నారు.అదనంగా, కొత్తగా అడవీని నరికివేసిన వారిపై అటవీ హక్కు చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.తమ సిబ్బందిపై వస్తున్న పిర్యాదుల విషయంలో కూడ శాఖ పరమైన విచారణ చేసి ప్రమేయం ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సిరికొండ అటవీ రేంజ్ పరిదిలో జరుగుతున్న సంఘటనలపై ఆర్మూర్ డివిజన్ పరిదిలోని బృందాలుగా చేసిన సిరికొండ, తూంపల్లి, పందిమడుగు సెక్షన్‌ల పరిదిలో అటవీ సంపదను నరికివేసినట్లు తెలియ వచ్చిందని ఎఫ్‌డీవో ప్రకటనలో తెలిపారు.అడవీని నరికిన వారిని గుర్తించి వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కోన్నారు.కొత్తగా అడవీనీ నరికివేయడం వల్ల ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలోస్తాయనే అపోహాలు మెండుగా ఉండడం వల్లె ఇలా జరుగుతుందని తెలిసిందని ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ముప్కాల్ ఆగస్టు23: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరి ధరించాలని హెడ్‌కానిస్టేబుల్ విఠల్ వాహనదారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం బాల్కొండ మండలంలోని బోదేపల్లి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాద నివారణాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సాయికుమార్, హోంగార్డు, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీజీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు23: ఎస్‌జీటీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కన్వీనర్ వెంకటరమణ, కోకన్వీనర్ గంగాప్రసాద్ తెలిపారు. ఎస్‌టీజీయు మండల అధ్యక్షుడున్న పొన్న ప్రవీన్, ప్రధానకార్యదర్శి బంటు ఆనంద్,కార్యవర్గసభ్యులు శ్రావణి,అర్వింద్, బ్రహ్మానందం, బసంత్, లక్ష్మీనారాయణ, గంగారాం, చంద్రశేఖర్‌లు ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రానున్న సమయంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతు ఎస్‌జీటీ సమస్యలపై పూర్తిస్థాయిలో సమస్యలను సాధించుకునే పోరాడుతామని అన్నారు. గత తెలంగాణ ప్రభుత్వం జీవో 21 ప్రవేశపెట్టిన ఉద్యోగులను బలవంతం జీవో 28ని నెట్టడం జరిగిందని, ఈ రోజు బ్లాక్ డేగా భావిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంతో కత్రాజీ రవి, మోహన్, మధు, నరేంధర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు23: భీమ్‌గల్ మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా అన్ని గ్రామాల పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీఈవో సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గ్రామంలో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రోడ్లపై, గుంతల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, లార్వ స్ప్రే, పిచ్చిమొక్కల తొలగింపు, మురుగుకాల్వ పూడికతీత పనులు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.

భిక్కనూరు బీసీ హాస్టల్‌లో వైద్యశిబిరం

భిక్కనూరు, ఆగస్టు 23: భిక్కనూరు మండలకేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో శుక్రవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిభిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారినీ యేమిమా హాస్టల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యా ర్థులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఏఎన్ఎం శ్యామల, ఆశాసవిత, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీని అందజేస్తున్న దృశ్యం

మోర్తాడ్,ఆగస్టు23:మండలంలోని పాలెం గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తి తీవ్రఅనారోగ్యంతో హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో వైద్యఖర్చులకు ఎక్కువ డబ్బులు కావడంతో బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డిని ఆశ్రయించారు.దీంతో సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌వోసీని సునీల్‌రెడ్డి మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అంద జేశారు. అపదసమయంలో ఆదుకున్న సునీల్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రమణ

భిక్కనూరు, ఆగస్టు 23: విద్యార్థులు పరిక్షల్లో ఉత్తీర్ణత సాధించేదని, తక్కువ మార్కులు వచ్చాయని క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని మానసిక వైద్య నిపుణులు వైద్యుడు రమణ అన్నారు. శుక్రవారం భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ముందుకు సాగాలని, మత్తుపదార్థాలకు, సెల్‌ఫోన్లకు బానిసలు కావద్దని సూచించారు.ఈయుక్త వయస్సులో లవ్‌కు తావి వ్వొద్దని, ఈ వయస్సులో ప్రేమ అనేది ఆక్షణ మాత్రమేనని అన్నారు. తల్లి దండ్రుల, గురువుల మాటలను వినాలన్నారు. ఇలాంటి ఆలోచ నలను పక్కనబెట్టి చదువుపై దృష్టి సారించి లక్ష్యసాధనకు ముందుకు సాగాలన్నారు. ఎవరైనా మానసిక ఆందోళనకు గురైతే ట్రాల్‌ఫ్రీ నెంబర్ 14416 కి కాల్‌చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారినీ యేమిమా, సోషల్‌వర్కర్ వంగ రాహుల్, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, వైద్య సిబ్బంది వెంకటరమణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రైతు ధర్నాను విజయవంతం చేయాలి

వేల్పూర్, ఆగస్టు23: ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీపై ఆర్మూర్‌లో రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతుల ధర్నాను విజయవంతం చేయాలని రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికి ఏలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ పార్టీలకు అతీతంగా చేపట్టనున్న ధర్నాను ఆర్మూర్ డివిజన్‌లోని రైతులందరు తప్పకుండా హాజరై విజయవంతం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు.

రైతు వేదిక వద్దకు తరలిన రైతులు

వేల్పూర్, ఆగస్టు23: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీ పథకంలో రుణమాఫీ కానీ రైతులు గత మూడు రోజుల నుంచి వేల్పూర్‌లోని రైతు వేదిక వద్దకు భారీగా తరలివస్తున్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే రైతులు తీసుకున్న పంట రుణాలు మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. మూడు విడతలుగా రేవంత్‌రెడ్డి సర్కారు రుణమాఫీ చేస్తున్నప్పటికీ రుణమాఫీ జాబితాలో పేర్లు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇటీవల కొన్ని చోట్ల కొన్ని గ్రామాల్లో రైతులు రోడ్లపైకి ఎక్కి ధర్నా, రాస్తారోకోలు చేశారు. దీంతో ప్రభుత్వం మండలానికో ప్రత్యేక అధికారిణి ఏర్పాటు చేసి రుణమాఫీ రాని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. దీంతో గత మూడురోజుల నుంచి వేల్పూర్‌లోని రైతు వేదికకు రైతులు భారీ సంఖ్యలో చేరుకొని దరఖాస్తులు చేసుకుంటు న్నారు. ఇప్పటి వరకు సుమారు 600పైగా దరఖాస్తులు చేసుకున్నారని, అందులో రేషన్‌కార్డు లేని వారు రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్న వారి దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు.

రుణమాఫీకి దరఖాస్తుల వెల్లువ

కమ్మర్‌పల్లి, ఆగస్టు23: రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న రెండులక్షల రుణమాఫీ పథకంలో అర్హులైనప్పటికీ లబ్ధి చేకూరని రైతులు తిరిగి దరకాస్తులు చేసుకోవాడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో గత మూడు రోజులుగా రైతులు కమ్మర్‌పల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన కేంద్రానికి మండలంలోని వివిధ గ్రామాలకు,చెందిన రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులు చేసుకుంటున్నారు. రుణమాఫీ కాని రైతులు తిరిగి దరఖాస్తులు చేసుకుని తప్పొప్పులను సవరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడంతో రుణమాఫీ కాని రైతులు అధార్‌కార్డులు పట్టా పాసుపుస్తకాలు, రేషన్ కార్డులతో వచ్చి దరకాస్తులు చేసుకుంటున్నారు. కమ్మర్‌పల్లి మండల ఇన్‌చార్జ్ ఏవో రమ్యశ్రీ అద్వర్యంలో నోడల్ అధికారులు రమేష్, సాయిరాంలు రుణమాఫి పథకం జాబితాలు పేర్లు రాని రైతులునుండి దరకాస్తులు స్వీకరిస్తున్నారు. కాగాదరకాస్తులు చేసుకున్న రైతుల్లో ఎక్కువశాతం (ప్యామిలి ఇండెంటిఫికేషన్)కుటుంబసభ్యుల పేర్లలో రైతుపేరు లేకపోవడం, తప్పుగా ఉండడంలాటి 336 దరకాస్తుల విచారణలో తెలినట్లు నోడల్ అధికారులు తెలిపారు.మరికొన్ని లోన్ ట్రాన్స్‌ఫర్ లాంటిదరఖాస్తులు రాగా వాటిని సరిచేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు 576 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

నవీపేట,ఆగస్టు23: రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తప్పకుండా అమలవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతులకు 31వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేపట్టిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ 5సంవత్సరాల కాలంలో చేసిన నాలుగు విడతల రుణమాఫీ వడ్డీ చెల్లింపులకే సరిపోయిందని విమర్శించారు. కొన్ని రాజకీయ పార్టీలు కావాలనే రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్కే బాబు, మూసా, బుచ్చన్న, సంజీవ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రవి, కృష్ణ తదితరులున్నారు.

రైతులకు వీడీసీ,గ్రామస్థుల మద్దతు

జక్రాన్‌పల్లి, ఆగస్టు23: ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసాను ప్రభుత్వం ఇవ్వాలని కోరుతూ కలిగోట్ గ్రామ వీడీసీసభ్యులు, గ్రామస్థులు మద్దతు తెలిపారు. శనివారం ఆర్మూర్ పట్టణంలో మామిడిపల్లిలోని శ్రీసాయిగార్డెన్‌లో జరిగే రైతుల ధర్నాకు మద్దతు తెలుపుతూ కార్యక్రమానికి రైతులు, గ్రామస్థులు అధిక తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో వసతులను పరిశీలించిన ఎన్‌సీసీ అధికారులు

మోర్తాడ్, ఆగస్టు23: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేయడానికి శుక్రవారం ఎన్‌సీసీ అధికారులు సందర్శించారు. ప్రవేశాల ప్రాంగణం, మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్య, భవనం, గ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని అధికారులు ధ్రువీకరించారు. రెండేళ్ల క్రితం ఎన్‌సీసీ యూనిట్ కొరకు దరఖాస్తు చేయగా జిల్లా కేంద్రం నుంచి అధికారులు వచ్చి పరిశీలించారని ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న తెలిపారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఎన్‌సీసీ ఇన్‌చార్జీ భూపతిని నియమిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, రవీందర్, అవంతి, అర్చన, అశోక్, సిబ్బంది విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ధన్‌పాల్



తిరుమలలో స్వామివారిని దర్శించుకున్న ధన్‌పాల్ కుటుంబ సభ్యులు

పెద్దబజార్, ఆగస్టు 23: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగు ప్రజలందరూ సుఖసంతోషాలతో అయురారోగ్యాలతో ఉండాలని రైతన్నలకు సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు అధికంగా పండాలన్నారు. తెలంగాణ రైతన్నలకు ఇచ్చిన రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తిచేస్తానన్న హామీ నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ నాయకులకు సీఎం మనసు మారాలని ఏడుకొండల స్వామిని వేడుకోవడం జరిగిందన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ సుడిగాలి పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్

సుభాష్‌నగర్, ఆగస్టు 23: నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ శుక్రవారం నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. నగరంలోని అర్సపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ఫ్రైడే డ్రైడే ప్రోగ్రాంలో పాల్గొన్నారు. అనంతరం కాలనీలో డెంగీ వచ్చిన వారి ఇంటిని, పరిసరాలను సందర్శించారు. అధికారులతో జనసర్వే చేయించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్‌లో ఓపెన్ ప్లేస్ విషయంలో వచ్చిన ఫిర్యాదుపై టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలోని వెజిటేబుల్ మార్కెట్‌ను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెంటర్ డాక్టర్ స్వామాట్ యాదవ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సుభాష్‌నగర్, ఆగస్టు 23: రెండు రోజుల క్రితం నిజామాబాద్ నగరంలోని ఆనంద్‌నగర్ ప్రాంతంలో కాలువలో పడి మృతి చెందిన బాలిక తల్లిదండ్రులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త ఆదేశాలనుసారం శుక్రవారం బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఓదార్చారు. అ నంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా బాధితులకు ఎదు రయ్యే సమస్యలకు అన్ని విధాల బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా కూడా ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. బిగాల గణేష్‌గుప్త ద్వారా అందజేసిన ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి వెంట ప్రభాకర్ రెడ్డి, సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, మురళి, విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ఐదు ట్రాక్టర్ల సీజ్



ఇందల్వాయి- సీజ్ చేసిన ట్రాక్టర్లతో అటవీశాఖ అధికారులు

ఇందల్వాయి, ఆగస్టు 23: ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలోని గండితండా, దూస్‌గాం, ధర్పల్లిలలో అక్రమంగా అటవీ భూమిని చదును చేస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎఫ్ఆర్‌వో రవిమోహన్ భట్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు నిజామాబాద్ సౌత్‌రేంజ్, ఇందల్వాయి రేంజ్‌లలో చెట్లను నరికి వేసి అటవీ భూమిని చదును చేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొని సిబ్బందితో వెళ్లగా చదును చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌చేసి ఇందల్వాయి రేంజ్‌కార్యాలయానికి తరలించామని అన్నారు. ఇందల్వాయి మండలంలోని గండితండా పరిధిలో మంచిప్ప సెక్షన్‌లో 1 ట్రాక్టర్, దూస్‌గాం బీట్‌లో 4 ట్రాక్టర్లు చదును చేస్తుండటంతో వాటిని పట్టుకొని కేసు నమోదు చేశామని అన్నారు. ఎఫ్ఆర్ వో రవి మోహన్ భట్ మాట్లాడుతూ అటవీ భూముల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గిరిజనులు తమకు ఇచ్చిన పోడు భూముల్లోనే వ్యవసాయం చేసుకోవాలని హద్దులు దాటి అటవీశాఖ పరిధిలోకి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈదాడిలో ఎఫ్ఆర్‌వోతో పాటు సెక్షన్ అధికారి సాయికుమార్, బీట్‌అధికారులు సాయికృష్ణ, ప్రవీణ్‌ప్రశాంత్, శశిధర్, పోశన్నరవి, సంతోష్, దేవిదాస్ తదితరులు ఉన్నారు.

యంచలో వివాదాస్పద స్థల పరిశీలన

నవీపేట,ఆగస్టు23: మండలంలోని యంచలో సర్వే నెంబర్ 270కి చెందిన 3.22ఎకరాల వివాదస్పద భూమిని శుక్రవారం నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ పరిశీలించారు. సంబంధిత స్థలం కోర్టు పరిధిలో ఉన్నందున కోర్టు తీర్పుకు లోబడి పరిష్కరించాల్సి ఉంటుందని సంబంధిత వ్యక్తులకు వివరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, గ్రామస్థులు ఉన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



నగరంలోని ఓ పాఠశాల ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు



నవీపేటలో స్పేస్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థినులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 23:జాతీయ అంతరిక్షం దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని వర్నిరోడ్‌లోగల సేయింట్ జెవియర్స్ పాఠశాలలో నేషనల్ స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేశారు. చంద్రయాన్-3, రాకెట్, విక్రమ్ లాండర్, ప్రజ్ఞారోవర్, సూర్య కుటుంబం, సూర్య గ్రహణం, మార్స్ సాటిలైట్, ఆధిత్య సాటిలైట్ తదితర ప్రాజెక్టులను పాఠశాలలోని 6వతరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తయారు చేశారు. విద్యార్థులకు అంతరిక్షం గురించి తెలియజేయాలి అదే విధంగా భవిష్యత్తు శాస్త్ర వేత్తలను తయారు చేసే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ పాకాల నర్సింహారావు, ప్రిన్సిపాల్ లతలు తెలిపారు.

ధర్పల్లి: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రథమ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు అనేక మోడల్స్‌ను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులలో శాస్త్రీయ, అంతరిక్ష ఆసక్తి పెంచేందుకు రకరకాల గోడపత్రికలు తయారు చేయించారు. విద్యార్థులకు వీటిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రసాహెబ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్పెస్ డే ఆకారంలో విద్యార్థినులు కూర్చుని ప్రదర్శించారు. అలాగే మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అట్టముక్కలతో విద్యార్థులు తయారు చేసిన చంద్రయాన్-3ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలపైన,అంతరిక్ష పరిశోధనలపై పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు అవగాహనను పెంపొందించుకోవాలని సత్యాశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు రావుట్ల నర్సయ్య కోరారు. సిరికొండలో అంతరిక్ష విజ్ఞానం - పరిశోధనలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి నర్సయ్య మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఆగస్టు 23 సువర్ణ అక్షరాలతో లిఖించబడిన రోజని అన్నారు. ప్రపంచ దేశాలకు సైతం సాధ్యం కానిదిభారతీయ శాస్త్రవేత్తలు సుసాధ్యం చేశారన్నారు.శాస్త్రీయ విజ్ఞానం,వినూత్న ఆలోచనలు,సమకాలిన సమాజ పరిణామాల ఆవశ్యకతలని సమంగా నవీన మానవ మనుగడకు కావల్సిన ఆవిష్కరణల కోసం అనునిత్యం మన శాస్త్రవేత్తలు శ్రమిస్తున్నారని అన్నారు. విద్యార్థులు సైతం పాఠశాల స్థాయి నుండే పరిశోధనల వైపు దృష్టి పెట్టాలని నర్సయ్య కోరారు. ఈకార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: నగరంలోని నిశితా ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ స్పేస్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈల్యాబ్ వల్ల విద్యార్థులకు అంతరిక్ష అన్వేషణతో పాటు అంతరిక్ష సంబంధిత ప్రాజెక్టులు, ప్రయోగాలు, పరిశోధనలో ప్రయోగాత్మక అనుభవాన్ని అందించడం జరుగుతుందని పాఠశాల చైర్మన్ నిఖిల్ తెలిపారు. విద్యార్థులకు వినూత్నమైన భవిష్యత్తు విద్యను అందించాలని ఉద్దేశంతో మొట్టమొదటి స్పేస్ ల్యాబ్‌ను జిల్లాలో ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ప్యాట్రన్ వినయ్‌కుమార్, డైరెక్టర్ పూజా, కోఆర్డినేటర్ రాజు, ప్రిన్సిపాల్ రమీందర్‌కౌర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి



విగ్రహ ప్రతిష్టాపనకుహాజరైన రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం

కోటగిరి,ఆగస్టు23: సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని వినాయక్ నగర్ కాలనీలో శుక్రవారం సంకట విమోచన గణపతి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ ప్రతిష్టాపన, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సంకట విమోచన గణపతి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. గణపతి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని అభివర్ణించారు. సమస్త విఘ్నలు తొలగించేది గణనాథుడు ఒక్కడేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేశానని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో ఆలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశానన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పోచారంతో పాటు రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజును సన్మానించారు. ఆలయ చిత్ర పటాన్ని బహుకరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్, నాయకులు మనోహర్, సిద్ధు, విఠల్ సెట్, హెగ్డోలి శంకర్, బర్ల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్యా

కమ్మర్‌పల్లి,ఆగస్టు23:మండలకేంద్రంలోని పోచమ్మగల్లికి చెందిన ఓ యువతి గురువారం రాత్రి తన ఇంట్లో ఎవరుయ లేని సమయంలో బెడ్ రూంలోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతి చెందినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. యువతి హైదరాబాద్‌లో బీటెక్ ఫైనల్ చదువుకుంటుంది. ఈ నెల 21న హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చిన యువతి తన వ్యక్తిగత వల్ల మనస్థాపానికి గురై బలవన్మారణానికి పాల్పడినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- టీఎస్ న్యాబ్ డీఎస్పీ సోమనాథం



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఖిల్లా, ఆగస్టు 23:యువత మత్తు పదార్తాలకు దూరంగా ఉండాలని టీఎస్ న్యాబ్ డీఎస్పి సోమనాథం పిలుపు నిచ్చారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సోమనాథం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. యుక్త వయస్సు నుంచే చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తు ఉండాలని వారి యొక్క నడవడికలను గుర్తించాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిరోధంపై ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలక భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసినట్లు గుర్తిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఇన్‌స్పెక్టర్ నరహరి, మూడవ టౌన్ ఎస్సై నర్సయ్య, కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్‌పల్లి, రూప్లానాయక్ తండాలో ఆకస్మిక తనిఖీ



పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

ఇందల్వాయి, ఆగస్టు 23: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చంద్రయాన్ పల్లి,రూప్లానాయక్ తండా ఉప కేంద్రాలను శుక్రవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. రూప్లానాయక్ తండాలో జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్స అందజేశారు. ప్రతీ గ్రామంలో హెల్త్ క్యాంప్‌లను నిర్వహించి రోగులందరికి మందులు అందజేయాలని స్థానిక వైద్యాధికారి సంతోష్‌కు సూచించారు. గ్రామంలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల వల్ల కలిగే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తిరిగి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలకుండీలు, పాతటైర్లు, నీటి కుండీలలో నిలువ ఉన్న నీటిని తొలగింపజేశారు. నీటి నిల్వలు గల ప్రదేశాలను గుర్తించి పంచాయతీ కార్యదర్శులకు నివేదిక పంపాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట డాక్టర్ సంతోష్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్, ఉన్నారు.

అబ్బాపూర్(ఎం) రోడ్డు ప్రమాద బాధితుల డిశ్చార్జ్

నవీపేట,ఆగస్టు23: మండలంలోని అబ్బాపూర్(ఎం)సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐదుగురు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారని ఎస్ఐ వినయ్ తెలిపారు. భైంసా నుండి బోధన్‌లో జరిగే ఉర్సు ఉత్సవానికి హాజరుకావడానికి ఆరుగురు యువకులు టావెరా వాహనంలో వెళ్లగా అబ్బాపూర్(ఎం) సమీపంలో ఎదురుగా బైక్ రావడంతో టావెరా వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో మహ్మద్ ఫైసల్(26)అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సల్మాన్, ముజుమర్, ఇర్షద్, రిజ్వాన్, జాఫర్ ఖాన్‌లకు చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయినట్లు ఎస్ఐ తెలిపారు.

కలిగోట్‌లో క్రీడా దుస్తుల అందజేత

జక్రాన్‌పల్లి, ఆగస్టు23: కలిగోట్ గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు క్రీడా దుస్తులను దాతలు చేశారు. జాతీయస్థాయి క్రీడాకారిణి ప్రియా ంక స్మారకార్థం విద్యార్థులకు క్రీడాదుస్తులను దాతలు సుజాత గంగాధర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేరుస్తున్నాం : కాంగ్రెనేతలు



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

డిచ్‌పల్లి,ఆగస్టు 23:ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేరుస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్ అన్నారు. డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్, రాంచందర్‌గౌడ్, డాక్టర్‌షాదుల్ల, దండుగుల సాయిలుతో కలిసి పొలసాని శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే ఇచ్చిన హామీలను నేరవేరుస్తుందని, రైతురుణామాఫీ కూడా అమలు చేస్తున్న ప్రభుత్వానికి ఓర్వాలేక విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బాజిరెడ్డి జగన్ కు లేదని గడిచిన పదేళ్ల కాలంలో రేషన్ కార్డులు మంజూరు చేయాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదన్నారు. టెక్నికల్ సమస్యలతో రుణమాఫీ ఆగిందని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పు దోవపట్టిస్తున్నారన్నారు. డిచ్‌పల్లిలో చేసిన బీఆర్ఎస్ ధర్నాలో రైతులు లేరని విమర్శించారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులు పెద్దొళ్ల శ్రీనివాస్, రాజన్న, ఉన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

ఇందల్వాయి, ఆగస్టు 23: బయోస్టార్ట్ కంపెనీ వారు బయోజైన్ ప్రగతి స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అందించారు. ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం రోజున బయోజైన్ పు ట్టిన రోజు సందర్భంగా ఒక్కో విద్యార్థికి రూ.2500 చొప్పున మెరిట్ కలిగిన 10 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లు తెలిపారు. మెరిట్ విద్యార్థులకు బ యోస్టార్ట్ కంపెనీ ప్రతినిధి, సేల్స్ మేనేజర్ కృష్ణారెడ్డి, స్వామి అయ్యప్ప ఫెస్టిఫైడ్ యజమాని లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లను పంపిణీచేశారు. ఈసందర్భంగా బయోస్టార్ట్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకునేందుకు ఉపకార వేతనాలు ఎంతో సహకరిస్తాయని ఇలాగే కష్టపడి చ దివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అయన విద్యార్థులకు సూచించారు. మంచి ప్రతిభకనబర్చిన విద్యార్థులకు తాము అన్నివిధాల సహకరిస్తామని అన్నా రు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుంకెట్ పాఠశాలకు ప్యూరిఫైర్డ్ వాటర్ ప్లాంట్ అందజేత

మోర్తాడ్, ఆగస్టు23: మండలంలోని సుంకెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 2000-01 విద్యసంవత్సరం పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు రూ.65వేల విలువ గల ప్యూరిఫైర్డ్ వా టర్ ప్లాంట్‌ను బహుకరించారు.పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పూర్వవిద్యార్థులు గమనించి దీనిని బహు కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పూర్వవిద్యార్థు లను అభినందించారు.

వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై దృష్టిసారించాలి

పెద్దబజార్, ఆగస్టు 23: సీజనల్ వ్యాధుల్లో ప్రధానంగా వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై దృష్టిసారించాలని ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ నారాయణ రావు అన్నారు. శుక్రవారం నగరంలోని ముబారక్‌నగర్‌లోగల ఆలంబన వృద్ధాశ్రమంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు ఆస్తమా, జ్వరం, సీజనల్ వ్యాధులు, చర్మవ్యాధులు, అర్శమోలలు వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులతో పాటు పండ్ల పంపిణీ చేశారు. హోమియోపతి మందుల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భావన, ఆయుష్ విభాగం ఫార్మసిస్టు ఎస్.పురుషోత్తం, ఉమ్మాప్రసాద్, పారామెడికల్ సిబ్బంది బిక్షపతి, రమేష్, మహేష్, ఆయుష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.